




# ప్రజాజ్యోతి

ఖమ్మం

మంగళవారం 19-3-2024 పేజీలు : 6


## ఎన్నికల నిర్వహణలో నిఘా

# బృందాల పాత్ర కీలకం

### జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్



**ఖమ్మం ప్రతినిధి మార్చి 18 ప్రజాజ్యోతి** స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణలో నిఘా బృందాల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. సోమవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి, ఎంసిసి బృందాలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో నిఘా బృందాలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. జిల్లాలో 15 ఎస్ఎస్టీ, 12 ఎఫ్ఎస్టీ, 27 ఎంసిసి బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన మొదటి 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ఆవరణల్లో, 48 గంటల్లో పబ్లిక్ స్థలాల్లో, 72 గంటల్లో ప్రయివేటు స్థలాల్లో రాజకీయ నాయకుల, రాజకీయ పార్టీలకు సంబంధించి హోర్డింగ్, ఫ్లెక్సీ, ఫోటోలు తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. చెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఉండాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని అన్నారు.

కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి కె. శ్రీరామ్ బృందాలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారి విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జెడ్పి సిఇఓ వినోద్, సిపిఓ శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ గోపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో

# విస్తృత తనిఖీలు

### వల్లభి చెక్ పోస్ట్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్

**ముదిగొండ మార్చి 18(ప్రజా జ్యోతి)** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా సరిహద్దులో పటిష్టమైన చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.సోమవారం ముదిగొండ మండలం వల్లభి చెక్ పోస్ట్ ను పోలీస్ కమిషనర్ సందర్శించారు.

ఈసందర్భంగా చెక్ పోస్టును పరిశీలించి ఎస్సై నరేష్ తో మాట్లాడారు. అనంతరం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ జిల్లాలో మోహరించిన కేంద్ర పోలీసు బలగాలతో పాటు,స్థానిక పోలీసులు తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశించే మార్గాలలో,చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు.ఖమ్మం నగరం నుంచి వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారని చెప్పారు.నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, నగలు,ఇతరత్రా సొత్తును సీజ్ చేసి,సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు.ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లరాదని,పెద్ద మొత్తంలో నగదు, ఆభరణాలు ఉంటే తప్పనిసరిగా వెంట సంబంధిత పత్రాలు ఉండాలని సూచించారు.

జిల్లాలో 12 ఎఫ్ఎస్టి,15 ఎస్ఎస్టి,2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్ పోస్టులు,10 ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలు గట్టి నిఘా ఉంచామని సిపి సునీల్ దత్ చెప్పారు.తనిఖీలు చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.ఆయన వెంట ఎస్సై గజ్జెల నరేష్,పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## రోడ్డు ప్రమాదంలో

# ఒకరు మృతి

### ఇద్దరికి తీవ్రగాయాలు

కల్లూరు మార్చి 18(ప్రజా జ్యోతి): మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలోని దళితవాడకు చెందిన యువకుడు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నుంచి వస్తుండగా ఎన్నెస్పీ క్రాస్ రోడ్ వద్ద ఆగి ఉన్న మినీ వ్యాన్ వెనక నుండి ఢీకొట్టడంతో యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు.ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.వీరు చంద్రుపట్ల దళితవాడ చెందిన యువకులు కె.కాళీ (18) , ఇనపనూరి రవితేజ,ఇనప నూరి చరణ్ ఇరువురికి తీవ్ర గాయాలు కాగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎస్కే షాకీర్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులను ఆసుపత్రికి తరలించారు. బాధిత బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళీ భౌతి గాయాన్ని పెనుబల్లి ఆస్పత్రికి పంచనామా నిమిత్తం తరలించారు.క్రాస్ రోడ్డు వద్ద ఉన్నటువంటి హెూటల్స్, వ్యాపార కార్యకలాపాలను నిర్వహించడం వలన భారీ వాహనాలు నిలపడంతో, రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందని, గతంలో కూడా ఎన్నో మార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.ఎస్సై షాకీర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు

# సాగర్ జలాలతో కుంటలను నింపాలి

**- తాగునీటి ఎద్దడకు నివారణ చర్యలు చేపట్టాలి. - రైతు సంఘం డిమాండ్**



**ముదిగొండ మార్చి 18(ప్రజాజ్యోతి)**
నాగార్జునసాగర్ జలాలు తాగునీటి కోసం సాగర్ ఎడమ కాల్వకు నీళ్లు విడుదల చేసిన ప్రభుత్వం ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లో సాగర్ జలాలతో కుంటలను నింపి వేసవికాలంలో తాగునీటి ఎద్దడ నివారణకు చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి వరప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వంనీ డిమాండ్ చేశారు.సోమవారం ముదిగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది వర్షాకాలం పంటల సీజన్ నుండి ఇప్పటివరకు సమృద్ధిగా వర్షాలు పడకపోవడంతో సాగర జలాలు లేక,పంటల సాగు తగ్గి రైతులు, ఆయకట్టదారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. యాసంగి పంటల సీజన్లో బోర్లు,వ్యవసాయ బావులు కింద రైతులు మొక్కజొన్న,వరి సాగు చేసినప్పటికీ నీళ్లు అందక అవి ఎండిపోయే దశకు చేరుకున్నాయన్నారు.18,19 మేజర్ కాలువల ద్వారా రెండు మండలాల్లో ఉన్న కుంటలను నింపి గ్రామాల్లో ప్రజలకు అవసరమయ్యే త్రాగునీటిని అందించాలన్నారు.ఏప్రిల్,మే నెలలో తీవ్రమైన తాగునీటి ఎద్దడ అధికమవుతుందని ఆయన చెప్పారు.ఇప్పటికే వ్యవసాయభావులు, చెరువులు,కుంటలలో నీరు అడుగంటిపోయి భూగర్భజలాలు తగ్గి ఎండిపోయాయన్నారు. మేతకు వెళ్లిన పశువులకు నీరు కూడా దొరకటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రానున్న కాలంలో తాగునీరు లేక పల్లెల్లో జనం అల్లాడుతారన్నారు. ప్రభుత్వము,అధికారులు, ప్రజాప్రతినిధులు త్రాగునీటిపై దృష్టిపెట్టి సాగర్ జలాలతో ముందస్తుగా కుంటలను నింపి గ్రామాలలో నీటి ఎద్దడ లేకుండా చేయాలని వాసిరెడ్డి వరప్రసాద్ పేర్కొన్నారు.

## సినీ నటుడు డాక్టర్ మురళీమోహన్ చేతుల మీదుగా

# శ్రీనివాస్ రాథోడ్ కు ఘన సన్మానం

**- సినీ రంగంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న మురళీమోహన్**
**- ఎల్.వి ప్రసాద్ ఆడిటోరియం ల్యాబ్ లో అట్టహాసంగా సన్మాన కార్యక్రమం**
**- మురళీమోహన్ అన్ని రంగాలలో విజయం సాధించారు - సినీ నటుడు శ్రీనివాస్ రాథోడ్**

**బోనకల్, మార్చి 18, ప్రజాజ్యోతి:**
సినిమా రంగంలో ,వ్యాపార,రాజకీయ రంగంలో అంచెలంచెలుగా ఎదిగి సినీ ఇండస్ట్రీలో 50 సంవత్సరాల పాటు విజయవంతంగా సినీ జీవితాన్ని గడిపిన నటుడు డాక్టర్ మాగంటి మురళీమోహన్ కు ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలుగు సినిమా వేదిక ఆధ్వర్యంలో బంజారాహిల్స్ లోని ఎల్ వి ప్రసాద్ ఆడిటోరియం ల్యాబ్ లో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బోనకల్ మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ రాథోడ్ సినీ ఇండస్ట్రీలో తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ లో ఒకసారి ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా రెండు సార్లు వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన సందర్భంగా సినీ నటుడు డాక్టర్ మురళీమోహన్ చేతుల మీదగా ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా,తెలుగు సినిమా వేదిక ఆధ్వర్యంలో శ్రీనివాస్ రాథోడ్ కు శాలువా కప్పి మెమొంటో షీల్డ్ తో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రాథోడ్ మాట్లాడుతూ అన్ని రంగాలలో విజయం సాధించినటువంటి గొప్ప నటుడు మాజీ మా అధ్యక్షుడు డాక్టర్ మురళీమోహన్ చేతుల మీదుగా తనకు ఘన సన్మానం జరగడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన మురళీమోహన్ 33 ఏళ్ల వయసులో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి ఎన్నో విజయాలు సాధించడమే కాకుండా వ్యాపారంలో జయభేరి రియల్ ఎస్టేట్ స్టార్ట్ చేసి ఎన్నో అపార్ట్మెంట్స్ కట్టి రాజకీయ రంగంలోను ఎన్నో




విజయాలు సాధించిన మురళీ మోహన్ మనకు తెలియని ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి ఎంతోమంది ప్రజల మన్ననలు పొందారని అన్నారు.సినీ ఇండస్ట్రీలో బోనకల్ గ్రామానికి గుర్తింపు లభించేలా ప్రయత్నం చేస్తానని శ్రీనివాస్ రాథోడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ టి పి సి ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగా, కార్యదర్శి వర్మ పాకాల పాటి, ప్రముఖులు దామోదర ప్రసాద్, తుమ్మల ప్రసన్నకుమార్, తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ప్రెసిడెంట్ ఏ రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ పద్మ రేఖ, కార్యదర్శి నూకరాజు, సహకార దర్శి రజిని శ్రీ కాళ, రామ్మోహన్, ఆర్గనైజింగ్ కెపి రెడ్డి, మరియు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, కొత్త రంగుల ప్రపంచం హీరోయిన్ శిలు,హీరో క్రాంతి, ప్రముఖ సినీ నటులు,టీవీ ఆర్టిస్టులు,తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా తిరుశాంతి కళ్యాణ మహోత్సవం

**ప్రజాజ్యోతి – ఏన్కూర్**
ఏన్కూరులోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం 12వ వార్షిక మహోత్సవం సందర్భంగా సోమవారం తిరుశాంతి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సుప్రభాత సేవ, మంగళ తోరణాలు, స్వామివారికి అభిషేకం, విగ్నేశ్వర పూజ, విభూదితో ప్రత్యేక అభిషేకం, బిల్వార్చన తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మేళ తాళాలు,మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి తిరుశాంతి కళ్యాణ మహోత్సవం జరిగింది. ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ శాశ్వత చైర్మన్ గోరింట్ల సత్యనారాయణ, ఆలయ ధర్మకర్త గోరింట్ల శ్రీనివాస చౌదరి మంజు శ్రీ దంపతులు, రమేష్ బాబు, ప్రభావతి రెడ్డి, రంగారావు అర్చకులు కిరణ్ కుమార్ చార్యులు, కిషోర్ చార్యులు భక్తులు పాల్గొన్నారు.



## పదో తరగతి పరీక్షల ప్రారంభం

**ముదిగొండ మార్చి 18(ప్రజా జ్యోతి)**
మండలంలోని పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైనాయి. మండలంలో 15 హైస్కూల్స్ నుండి 523 మంది పదో తరగతి విద్యార్థిని,విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు మండలంలో ఐదు పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేయగా 522 మంది పరీక్ష కేంద్రాలకు హాజరయ్యి పరీక్ష రాశారు.ఒక విద్యార్థి పరీక్షకు గైరాజరయ్యారని ఎంఈఓ బివి రామాచారి తెలిపారు.

## గుమ్మెట తంబూర మోత బేడ (బుడగ) జంగం హక్కుల పోరాట సమితి వర్ధిల్లాలి.

**ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఎన్నిక :**



ఖమ్మం కల్చరల్ మార్చి 18 ప్రజాజ్యోతి.
ఖమ్మం జిల్లా ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో గుమ్మెట తంబూర మోత బేడ (బుడగ) జంగం హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా నూతన కమిటీ సమావేశము జరిగినది . ఈ సమావేశం వీరప్ప సమక్షంలో జరిగినది . ముఖ్యఅతిథిగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సిరిగిరి మెన్నెం పాల్గొని నూతన కమిటీని నియమించారు . ఖమ్మం జిల్లా బేడ (బుడగ) జంగం హక్కుల పోరాట సమితి చైర్మన్ పస్తం సహదేవరాజు గురుజీ (గంధసిరి) , ఖమ్మం జిల్లా బేడ (బుడగ) జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కళ్ళేం సీతయ్య (పల్లెగూడెం) , పస్తం వెంకన్న , చేర్ల కోటయ్య , కె.వి కోటయ్య రాజు, కొండపల్లి గురవయ్య, శ్రీ పాటి నాగరాజు , పస్తం రామరాజు, పస్తం రంగారావు, గంజాయి కృష్ణ, గంధం జగన్నాథం (వి.ఎం.బంజార), సింగపూర్ శ్రీను (ముస్తాబ్ నగర్), ఆలేటి లక్ష్మణ్ , భూతం రామచంద్ర, శ్రీ పాపతి శ్రీను, కళ్యాణం ఏడుకొండలును ఎన్నుకున్నారు.

## బోనకల్ చెక్ పోస్ట్ వద్ద పెరిగిన నిఘా

**ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా చెక్ చేస్తున్న పోలీసులు**
**సరిహద్దు చెక్ పోస్ట్ ను పరిశీలించిన ఏసిపి రెహమాన్**



**బోనకల్, మార్చి 18, ప్రజాజ్యోతి:**
రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్ పోస్ట్ ను సోమవారం వైరా ఏసిపి మహ్మద్ అబ్దుల్ రెహమాన్, తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్,ఎస్సై తో కలిసి సందర్శించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఏసిపి రెహమాన్ మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్,జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు తనిఖీలు ముమ్మరంగా నిర్వహించాలని తెలిపారు.సరిహద్దు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు.నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు లేకుండా తరలించే నగదు,నగలు సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు.ఎన్నికల నిబంధనల మేరకు పెద్ద మొత్తంలో నగదు,ఆభరణాలు ఉంటే తప్పనిసరిగా వెంట సంబంధిత పత్రాలు ఉండాలని సూచించారు.రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లరాదని తెలిపారు.24 గంటలు గట్టి నిఘా ఉంచాలని ఏసిపి రెహమాన్ ఎస్సై మధుబాబుకి తెలిపారు.తనిఖీలు చేస్తున్న పోలీసులకు మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ జి.లక్ష్మణ్,ఎంపీఓ విఎస్.శాస్త్రి,హెడ్ కానిస్టేబుల్స్ సువర్ణబాబు, ఆనంద్,పంచాయతీ కార్యదర్శి దామళ్ళ కిరణ్ తదితరులు ఉన్నారు.

# కమలమ్మ మృతి బాధాకరం

### డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు నివాళులు



**తల్లాడ, మార్చి 18 (ప్రజాజ్యోతి):**
తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఇస్నపల్లి కమలమ్మ ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆమె దశదినకర్మ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్నారుగూడెం సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్నారుగూడెం గ్రామ విడిసి చైర్మన్ మారెళ్ళ మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా కంచర్ల నాగభూషణం కుటుంబ సభ్యులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలోకంచర్ల నాగభూషణం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో స్వాతంత్ర్య సమర యోధుడు లక్ష్మీనర్సయ్య మృతి

**ఎర్రుపాలెం, మార్చి18, ప్రజాజ్యోతి :**



ఎర్రుపాలెం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడిపుడి లక్ష్మీనర్సయ్య (96) సోమవారం ఉదయం ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరణించిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు సూరంశెట్టి భాస్కరరావు, కడయం శ్రీనివాసరావు, మల్లెల లక్ష్మణరావు , చెప్ప మధుసూదన్, మెట్టు కృష్ణ, సూరం శెట్టి రాజేష్, శ్రీపాలిశెట్టి శ్రీనివాసరావు, పుపాళ్ళ శ్రీనివాసరావు పసుపులేటి రవి, మగినం వీరభద్రం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి లక్ష్మీనరసయ్య మృతికి సంతాపం తెలియజేశారు.

## గురవయ్యపై జిల్లా పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు



**తల్లాడ, మార్చి 18 (ప్రజా జ్యోతి):**
తల్లాడ పట్టణానికి చెందిన బజారు మంగతాయి (మణి) ఇంటిని లోన్ పేరుతో మాయచేసి గత మూడేళ్ల క్రితం గుంజి గురవయ్యకు విక్రయి%శీ%చినట్లుగా సొంతం చేసుకొని మోసం చేసినందుకు సదరు బాధిత మహిళ సోమవారం ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ కు ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా ఆ భూమిపై 20లక్షలు లోన్ తీసుకుని ఆ పైసలు, కొంత బంగారం పలు రకాల వస్తులు కూడా స్వాహా చేసిన సంఘటనపై ఆమె లిఖితపూర్వకంగా సీపీకి అందించారు. గతంలో ఆమె తల్లాడ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన సంగతి విధితమే.గ్రీవెన్స్ డే లో పరిస్కృతీ జిల్లా పోలీస్ అధికారి సునీల్ దత్ కీ బాధితురాలు మంగతాయి తనకి జరిగిన అణ్యాయాన్ని వివరి%శీ%చి ఫిర్యాదు అందించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

# ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ టికెట్ మొహమ్మద్ జావీద్ కి ఇవ్వాలని వినతిపత్రం

**ఖమ్మం మార్చి 18 ప్రజా జ్యోతి :** ఈరోజు స్థానిక ఖమ్మం జిల్లా సంజీవరెడ్డి భవనం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఆఫీసు నందు పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ నీ కలసి ఖమ్మం లోక్ సభ స్థానాన్ని (పార్లమెంట్) కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గత 30 సంవత్సరాలుగా %వ్రూజజ, ూ×జజ% అదేశాలానుసారంగా క్రమశిక్షణ తో నడుచుకుంటూ పార్టీ కి సేవలందిస్తున్న మొహమ్మద్ జావీద్ కి కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. రాజకీయ చరిత్రలో ఖమ్మం అసెంబ్లీ స్థానాన్ని అత్యధిక సార్లు ముస్లిం మైనారిటీలకు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీ కే చెందిందని, 1999 నుండి నేటి వరకు ఎంపీ గా, ఎమ్మెల్యే గా, ఎమ్మెల్సీ గా ముస్లిం ల ప్రాతినిధ్యం లేక పోవడం శోచనీయం అన్నారు. మొహమ్మద్ జావేద్ ఎమ్మెల్యే అభ్యర్థి గా పేరుగాంచి తన సామాజిక వర్గం పెద్దలు యువతో పాటు , %ూజ ూ దీజ%, మైనారిటీ మరియు పార్టీ పెద్దల, ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నార న్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల పరిణామాల నేపథ్యం లో గౌరవ పెద్దలు తుమ్మల పోటీ చేయడం జరిగిందని, జావేద్ కూడా %వ్రూజజ ూ×జజ% ఆదేశాలను శిరసా వహించారు మొహమ్మద్ జావేద్ సేవలను గుర్తిస్తూ వారినీ ఎంపీ గా ఎమ్మెల్సీ గా , రాష్ట్రానికి , జిల్లా కి మరియు మైనారిటీ సమాజానికి సేవ చేసుకునే గౌరవ హోదా కల్పిస్తారని ఆశించామన్నారు. నేటికీ వారికి ఎటువంటి పదవీ కల్పించలేదు, కాంగ్రెస్ పార్టీ క్యాడర్ మొత్తం ఎంతో ఆష గా ఎదురు చూస్తున్నా నేటికి వారికి ఎటువంటి న్యాయం జరగ లేదు అని, మొన్న ప్రకటించబడిన కార్పోరేషన్ చైర్మన్ ల పదవులలో కూడా ఖమ్మం కు చెందిన ఒక్క ముస్లిం అభ్యర్థికి కూడా చోటు లేకపోవడం శోచనీయం అని, ప్రస్తుతం రాష్ట్రం లో అధికారం లో ఉన్న కాంగ్రెస్ పార్టీ, కేంద్రం లో కూడా అధికారం లో రావాలని నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పోరాడుతున్న



తరుణం లో ముస్లిం మైనారిటీ అయినటువంటి మొహమ్మద్ జావేద్కి పదవి రాకపోవడం క్రింది స్థాయి కార్యకర్తలు నాయకులను కూడా నిరాశపరిచిందన్నారు. వెంటనే జిల్లా పెద్దలు, గౌరవ మంత్రులు, తుమ్మల పొంగులేటి , భట్టి చొరవ చూపి వెంటనే మైనారిటీలకు, పార్టీ కోసం కష్ట పడిన క్యాడర్ ను గుర్తించి సముచిత స్థానం కల్పిస్తూ న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. తదనంతరం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ కి ఖమ్మం పార్లమెంట్ సీట్ ని మొహమ్మద్ జావీద్కి ఇవ్వాలని కాంగ్రెస్ కార్యకర్తల సంతకాలు తో కూడిన వినతి పత్రాన్ని సంజీవరెడ్డి భవన్ లో 200 మంది కార్యకర్తలతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు, రబ్బానీ , గౌస్ , శంకర్ నాయక్, మహమూద్, కందుల శ్రీనివాస్, నీలవేణి, సుగుణ, ముజాహిద్, ముక్రమ్, జానీ, పుల్లగుర పరమేష్, పాషా, నరసింహారావు, రాంబాబు, వసీమ్, ఫరీద్ ఖాద్రి, జానీ పాషా, అబ్దుల్ అహద్, ఖైసర్, ఫరూక్, జాకిర్, నసీర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ నీ సన్మానించిన కందుల పాపారావు

**బోనకల్, మార్చి 18, ప్రజాజ్యోతి:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా నూతి శ్రీకాంత్ గౌడ్ నియమించడం జరిగింది.నూతనంగా నియమితులైన శ్రీకాంత్ గౌడ్ నీ సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు, ఆళ్లపాడు గ్రామ వాసి కందుల పాపారావు తన సహచరులతో కలిసి తెలంగాణ గాంధీ భవన్ లో శ్రీకాంత్ గౌడ్ ని తన ఛాంబర్ లో బోకే అందజేసి,శాలువాతో సత్కరించి మండల తరుపున శుభాకాంక్షలు తెలియజేశారు.తనపై నమ్మకంతో రాష్ట్ర బీసీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ రాష్ట్ర బీసీ సోదరులకు తన వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు శ్రీకాంత్ గౌడ్



తెలియజేశారు.

# కేసుపల్లిలో యువకుడి దుర్మరణం

**ప్రజాజ్యోతి-ఏన్కూర్**
ఏన్కూరు మండలం కేసు పల్లిలో కల్వర్టుకు బైక్ ఢీకొన్న సంఘటనలో అదే గ్రామానికి చెందిన శెట్టిపల్లి సురేశ్(40) అనే యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కేసు పల్లి గ్రామానికి చెందిన శెట్టిపల్లి సురేష్ ఆదివారం రాత్రి 8.30 సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి 11 గంటల వరకు తిరిగి రాలేదు. తన భార్య సరస్వతి కుటుంబ సభ్యులకు తెలపడంతో చుట్టు ప్రక్కన వెతికారు. గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద తలకు బలమైన గాయంతో సురేశ్ మృతదేహం లభ్యమయింది. ప్రమాదవశాత్తు



మోటార్ సైకిల్ కల్వర్టుకు ఢీకొని మృతిచెందినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని సోదరుడైన నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బాదావత్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఏన్కూరు సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు తమ్ముడి కుమారుడు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండే సురేష్ ఆకస్మిక మృతి తో కేసుపల్లి గ్రామంలో విషాదం అలుముకుంది. సురేష్ మృతి వార్త తెలియడంతో పరిసర గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. వివిధ పార్టీల నాయకులు మృతదేహాని సందర్శించి నివాళులర్పించారు.

## కూసుమంచి మండల కేంద్రంలో టీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీటీసీ. మాదాసు ఉపేందర

**కూసుమంచి మార్చి18 ప్రజా జ్యోతి**
కూసుమంచి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీ షాపును కూసుమంచి ఎంపీటీసీ సభ్యులు మాదాసు ఉపేందర్ రావు భారీ వీరభద్రం గార్లు ప్రారంభించారు.కూసుమంచి లోనే నేలకొండపల్లి రూట్ లో నూతనంగా ఎస్ ఆర్ కె మిల్క్ ప్రొడక్షన్ సంస్థ వారిచే ఏర్పాటుచేసిన టీ షాపులో పాలు పెరుగు బాదం మిల్క్ లభించే విధంగా ఏర్పాటుచేసిన షాపును మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గట్టుసింగారం మాజీ సర్పంచ్ చాట్ల పరశురాం,షాపు నిర్వాహకులు వెంకటేశ్వర్లుకొండా మైపాల్, ఎస్కె సొందు, అరవపల్లి జనార్దన్ గౌడ్, ముసుకు మాధవరెడ్డి, పాల్గొన్నారు.

# బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా మహిళలు పోరాడాలి

## పిఓడబ్ల్యు రాష్ట్ర కోశాధికారి టీ ఝాన్సీ లక్ష్మి పిలుపు




**తిరుమలాయపాలెం, మార్చి 18, ప్రజాజ్యోతి :** బిజెపి కేంద్ర ప్రభుత్వ పాలనలో దేశంలో మునుపెన్నడు లేని విధంగా ఫాసిస్ట్ మతోన్మాద, మనువాద విధానాలు పెరిగిపోయి అమాయక ప్రజలు బల వుతున్నారని, మహిళలు చైతన్యవంతంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం (పి ఓ డబ్ల్యు ) రాష్ట్ర కోశాధికారి టీ ఝాన్సీ లక్ష్మీ పిలుపునిచ్చారు. సోమవారం తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలో మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సభను శ్రామిక మహిళలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న పని ప్రదేశంలో సభను నిర్వహించారు. టీ ఝాన్సీ లక్ష్మీ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తూ, మోడీ 2016 సంవత్సరం నుండి "బేటీ బచావో, బేటీ పడావో" నినాదం చేపట్టారన్నారు . నిర్భర భారత్, వికసిత భారత్, అచ్చేదిన్ లాంటి నినాదాలు చూస్తే చాలా అద్భుతంగా అనిపిస్తాయన్నారు . కానీ విద్య, ఉపాధి, వేతనాలలో ఇలా అడుగడుగునా అన్నింటిలో స్త్రీలు వివక్ష నెదుర్కుంటూనే ఉన్నారన్నారు . మహిళా సంక్షేమం కోసం చట్టాలు ఎన్ని చేసినా దేశంలో రాష్ట్రంలో మహిళలు దాడులకూ, హత్యలకూ బలవుతూనే ఉన్నారన్నారు. భారతదేశ మహిళల్లో 70 శాతం మంది ఏదో ఒక హింసకు గురవుతున్నారని ఒక సర్వే తేల్చి చెప్పిందన్నారు . ప్రపంచంలో అత్యధికంగా బాల్య వివాహాలు జరుగుతున్న దేశాలలో మన దేశం మూడో స్థానంలో ఉందన్నారు . అంతేకాదు ప్రపంచ ఆహార ఉత్పత్తిలో మహిళలు 50% నుండి 80% వరకు భాగస్వాములవుతున్నారు. కానీ వీరు 10% కంటే తక్కువ భూమి కలిగి ఉన్నారన్నారు. 2023 యుఎన్ ప్రకారం 70% మందిగా ఉన్న మహిళల్లో 40% మంది పేద కుటుంబాలకు చెందిన వారేనన్నారు. పౌష్టికాహార లోపంతో ఉన్న ప్రతి ముగ్గురిలో ఒకరు భారతీయులే నన్నారు. ఆకలితో అలమటించే అన్నార్తుల జాబితాలో మనదేశం 111 వ స్థానం దక్కించుకుంది. గత రెండు సంవత్సరాల కాలంలో ఒక్క శాతంగా ఉన్న బడాబాబుల ఆదాయం 30% పెరిగిందన్నారు. పేదల, శ్రమజీవుల ఆదాయం మాత్రం ఒక్క శాతానికి పడిపోయిందన్నారు. ఇది కాకులను కొట్టి గద్దలకు పెట్టిన చందంగా ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల ధరలు ఎప్పుడూ లేనంతగా 30% నుండి 50%కు పెరిగాయన్నారు. దేశంలో మహిళలు, వివిధ వర్గాల, వృత్తుల ప్రజలు సమస్యల సుడిగుండంలో ఉంటే వికసిత భారత్, అచ్చేదిన్ అంటున్నారన్నారు . మోడీ, పేదరికం, కరువుకు గురయ్యే ప్రజలు కేవలం 5% మాత్రమే పేదరికంలో ఉన్నారని ఆయన పాలనకు కితాబిచ్చుకుంటున్నారన్నారు. బీజేపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక, కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాస్తున్న విధానాలను గురించి ప్రజానీకం ఆలోచించకుండా, ప్రశ్నించకుండా అయోధ్య రామాలయాన్ని ఉపయోగించుకుంటున్నాడన్నారు. చిత్తం శివుడి మీద భక్తి చెప్పుల మీదన్న చందంగా ఉందన్నారు. బాలరాముడి ప్రాణ ప్రతిష్టపై నిష్టకంటే మోడీ మళ్ళీ అధిష్ఠాన ప్రతిష్టే, అధికార పీఠమెక్కే ప్రయత్నమే అయోధ్య ఆంతర్యంఅని అన్నారు . అన్నదమ్ముల్లా కలిసుండే ప్రజల్లో కలహాలు సృష్టిస్తోంది బీజేపీ ప్రభుత్వమన్నారు. మతం అనే మత్తు మందు వ్యాప్తి చేసి దేశ ప్రజానీకాన్ని మాయ చేస్తున్నారన్నారు. యువతరం మెదళ్ళలో విషబీజాలు నాటుతున్నారనారు. రామరాజ్యమంటూ హిందువులను రెచ్చగొడుతున్నారన్నారు. మనుధర్మ రాజ్యాంగాన్ని తేవటానికి సర్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కి వేస్తున్నారన్నారు. దేశ ద్రోహులంటూ జైళ్ళల్లో నిర్బంధిస్తున్నారనారు. ప్రభుత్వం మేధావులపై, జర్నలిస్టులపై దాడులకు పూనుకున్న ఘటనలు ఎక్కువవుతున్నాయన్నారు. మహిళా రచయితలపై, ప్రజాస్వామికవాదులపై, సామాజిక కార్యకర్తలపై ఆర్ఎస్ఎస్ అనుచరగణం ట్రోలింగ్ చేస్తున్నారన్నారు. గత సంవత్సరం రైతాంగం చేసిన ఉద్యమానికి తలొగ్గిన మోడీ మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తానని మాట తప్పాడన్నారు. దీనితో రైతాంగం మలిదశ ఉద్యమానికి సిద్ధమయిందన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు )పాలేరు డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి సరోజిని ప్రసంగిస్తూ, మోడీ మొండి వైఖరి అవలంబిస్తూ, దేశానికి అన్నం పెట్టే అన్నదాతలపై లాఠీ, తూటాలను ప్రయోగిస్తున్నారని అన్నారు. రామరాజ్యమంటే ఇదేనాఅని, రైతులేనిదే రాజ్యం లేదని అ న్నారు. మోడీ రోటీ– బాటీ తినాలంటే అంబానీ, ఆదానీ కరెన్సీతో కడుపునిండదన్నారు. ఊరూరా మీరు పంపిణీ చేసే అక్షింతలు రైతన్నల కష్టార్జితమేనన్నారు. బీజేపీ ప్రభుత్వం రాముడి పేరుతో రాజకీయ కుయుక్తులతో లబ్ధిపొందాలని చూస్తున్న విధానాన్ని ప్రజలందరూ గమనించాలన్నారు. మతోన్మాదంతో ప్రజలను విభజించి, పాలించే దుర్మార్గపు నీతిని ఎండగట్టాలన్నారు. మోడీ ప్రభుత్వమనుసరించే మతోన్మాద, ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా పోరాడుదామన్నారు. మన హక్కులనూ, లౌకిక ప్రజాస్వామ్యాన్నీ కాపాడుకొందామని ఆమె అన్నారు. ఈ సభలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పాలేరు డివిజన్ నాయకులు తిమ్మిడి హనుమంతరావు, పార్టీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, మండల నాయకులు ఎన్నబోయిన శ్రీనివాసరావు, అంగిరేకుల పిచ్చయ్య, గుజ్జ పుల్లయ్య, పులిపలుపుల వెంకటమ్మ, ఉమా. సునీత పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో మోడీ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

## బచ్చోడు లో పోస్టర్లు అవిష్కరనలో భాగంగా (పివైఎల్) ఖమ్మం జిల్లా కార్యదర్శి గొర్రెపాటి రమేష్

**తిరుమలాయపాలెం, మార్చి 18, ప్రజాజ్యోతి :** భగత్ సింగ్ 93 వ వర్ధంతి సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) ప్రగతి శీల యువజన సంఘం (పి వై ఎల్ ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం తిరుమలాయపాలెం మండలం బచ్చోడు లో పోస్టర్లు అవిష్కరన చేయటం జరిగింది ఈ సందర్భంగా ప్రగతి శీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి గొర్రెపాటి రమేష్ పాల్గొని మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం, స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం తమ విలువైన ప్రాణాలను భారత జాతికి అంకితం చేశారని, ఉరితాడును ముద్దాడి అమరులయ్యారని భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల స్ఫూర్తితో యువత యువజన పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో రోజు రోజుకీ మతోన్మాదం, ఫాసిజ పెరుగుతుందనీ. కేంద్ర, ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వక యువత పెడదారి పడుతున్నారన్నారు. గ్రామాలలో బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగిపోయాయని అంగడిలో సరుకులాగ మద్యం ఏరులై పారుతోంది అని దీని ద్వారా యువత కు నష్టం జరుగుతున్నదని యువతను చెడు వ్యసనాలకు మళ్ళించే వైపు బెల్టు షాపులు ఉన్నాయని తక్షణమే గ్రామాలలో ఉన్న బెల్ట్ షాపులను ఎత్తివేయాలని, యువతను కాపాడాలని, సమానత్వం, సమసమాజం కోసం జరుగుతున్న పోరాటంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ విధానానికి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం దోపిడీ, పీడన లేని నూతన వ్యవస్థ కోసం యువతీ, యువకులు తిరుగుబాటుకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు దరమల్లా శంకర్, నందిపాటి ఉపేందర్, గొర్రెపాటి భగత్ సింగ్, సురేష్, వీరబాబు శ్రీకాంత్, హుస్సేన్, నందిపాటి మహేష్, అశోక్, కిరణ్, రమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# పోషకాహారం వల్లే తల్లి బిడ్డ క్షేమం

## గర్భిణీ స్త్రీలకు శ్రీమంతలు



**చింతకాని, మార్చి 18 ప్రజాజ్యోతి:** పోషకాహారం వలన తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని సిడిపిఓ కమల ప్రియ తెలిపారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో పోషణ్ పక్వాడలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.... ఈ సందర్భంగా సిడిపిఓ కమల ప్రియ మాట్లాడుతూ బాలింతలు గర్భిణ బాలింతలు గర్భిణీలు పిల్లలు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉండాలంటే తప్పనిసరిగా పోషక విలువలతో కూడిన పదార్థాలను తీసుకోవాలన్నారు అనంతరం పోషణ్ పక్వాడలో భాగంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తయారు చేసే విధానం తెలియజేశారుఈ కార్యక్రమంలో అడిషనల్ సిడిపిఓ శివమ్మ, సూపర్వైజర్ పద్మావతి, రామకృష్ణాపురం అంగన్వాడీ టీచర్లు దామావతి, అనిత, విజయలక్ష్మి, సాకీర .ఉమ నిర్మ,పుల్లమ్మ, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లాల పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఆకస్మిక తనిఖీ

## మద్యం, నగదు రవాణాను నియంత్రించాలి : జిల్లా అడిషనల్ జాయింట్ కలెక్టర్ మధుసూదన్ నాయక్



**తిరుమలాయపాలెం, మార్చి 18, ప్రజాజ్యోతి :** తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురం క్రాస్ రోడ్డు అంతర్ జిల్లాల పోలీస్ చెక్ పోస్ట్ వద్ద జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఎన్నికల నియమావళి ప్రకారం మద్యం, నగదు రవాణాను నియంత్రించాలన్నారు. ప్రతి వాహనం చెకింగ్ రిజిస్టర్ పాటించాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్, పంచాయతీ, రెవిన్యూ వారికీ సూచనలు చేశారు. తదుపరి హస్నాబాద్ పోలింగ్ కేంద్రం 41, బచ్చోడు47, 48మరియు పిండిప్రోలు 26, 27, 28, 29 పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సంబంధిత ఉపాధ్యాయుల, బి ఎల్ ఓ లను మౌలిక సదుపాయల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో స్థానిక తహసీల్దార్ పీవీ రామకృష్ణ, సూపర్వైజర్ బి వీరయ్య, ఏ లక్ష్మణ్, సంబంధిత బి ఎల్ ఓ పగడాల రాజ్ కుమార్, కొండపల్లి ఉష, ఎం నాగేశ్వరావు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్ తో బంగారు మైసమ్మ ప్రతిష్టిత దున్నపోతు మృతి



**తిరుమలాయపాలెం, మార్చి 18, ప్రజాజ్యోతి :** విద్యుత్ ఘాతంతో బంగారు మైసమ్మ దేవతకు ప్రతిష్టించిన దున్నపోతు చనిపోయిన సంఘటన తిరుమలాయ పాలెం మండలం లోని రఘునాథపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మాదిగ కులస్తులు బంగారు మైసమ్మ తల్లి పండుగ చేసుకొనుటకు వదిలిపెట్టిన దున్నపోతు నీళ్ల త్రాగుటకు వెళ్లి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఎర్త్ తీగకు తగిలింది ఎర్త్ తీగకు విద్యుత్ సరఫర కావడంతో దున్నపోతు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అక్కడ మనుషులు ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటన స్థలాన్ని చేరుకొని విద్యుత్ నిలిపివేశారు. అనంతరం ఊరు పెద్ద మనుషులు దున్నపోతు భౌతిక కాయాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో ఖననం చేశారు. ఈ సందర్భంగా కుల పెద్దలు మాట్లాడుతూ 40 వేల రూపాయల విలువ దున్నపోతు మరణించిందని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొని మరొక దున్నపోతు కొనుక్కోవడానికి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని అధికారులని కోరారు.

## చెక్ పోస్టుల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్




**ఖమ్మం ప్రతినిధి మార్చి 18 ప్రజా జ్యోతి**

చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. లోకసభ సాధారణ ఎన్నికల సందర్భంగా స్థానిక కాల్వఒడ్డు, నయాబజార్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్టి చెక్ పోస్ట్ ను సోమవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పటిష్ట నిఘా చర్యలు చేపట్టి విస్తృత తణిఖీలు నిర్వహించాలని, నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని అన్నారు. పోలీసు సిబ్బంది విధులు నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆయన తెలిపారు. సిసి కెమెరా ల ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల తనిఖీ సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ప్రతి చెక్ పోస్ట్ లో వీడియోగ్రఫీ కి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అప్రమత్తంగా వుంటూ, 24 గంటల పటిష్ట నిఘా పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం అర్బన్ తహశీల్దారు సిహెచ్. స్వామి, అధికారులు తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి,క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా

**సహకరించిన పార్టీ పెద్దలకు,నాయకులకు, కార్యకర్తలకు**

**కృతజ్ఞతలు : పెద్ద బోయిన ఉమా శంకర్**

**కారేపల్లి,మార్చి18, ప్రజా జ్యోతి:**



సింగరేణి మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెద్ద బోయిన ఉమాశంకర్ సోమవారం బిఆర్ఎస్ పార్టీకి,క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.తొడితలగూడెం ఎంపీటీసీ, బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా గత నాలుగు సంవత్సరాలుగా పనిచేసిన ఉమాశంకర్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి,తన రాజీనామా పత్రాన్ని జిల్లా పార్టీ అధ్యక్షులకు అందజేశారు.తన వ్యక్తిగత కారణాల దృష్ట్యా రాజీనామా చేస్తున్నానని, ఇంతకాలం పార్టీలో తనకు సహకరించిన పార్టీ పెద్దలకు,నాయకులకు,కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

## ఫ్లయింగ్ బృందాల వాహనాలను జండా ఊపి ప్రారంభించిను జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్

**ఖమ్మం ప్రతినిధి మార్చి 18 ప్రజా జ్యోతి**



స్వేచ్ఛ, న్యాయబద్ద ఎన్నికల నిర్వహణలో భాగంగా క్షేత్ర స్థాయిలో నిఘా కొరకు ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ బృందాల వాహనాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ నూతన కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఇట్టి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఖమ్మం నియోజకవర్గంలో 3, పాలేరు నియోజవర్గంలో 3, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో రెండు చొప్పున విధులు నిర్వర్తిస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, సిపిఓ శ్రీనివాస్, ఖమ్మం ఎంవిఐ వెంకటరమణ, అదనపు పౌరసంబంధాల అధికారి వి. శ్రీనివాసరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ విపి గౌతమ్




**ఖమ్మం ప్రతినిధి మార్చి 18 ప్రజా జ్యోతి**

ఈరోజు నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అయినట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. కలెక్టర్ సోమవారం స్థానిక నయాబజార్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పరీక్షా సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షా కేంద్రంలో వైద్య శిబిరం, త్రాగునీరు, కనీస మౌళిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. ఎండల దృష్ట్యా వైద్య శిబిరం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడ పొరపాట్లకు తావివ్వకుండా నిబంధనల మేరకు పరీక్షల నిర్వహణ చేయాలన్నారు. పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణా పోలీస్ ఎస్కార్ట్ తో చేయాలన్నారు. మొబైల్ ఫోన్లు కేంద్రంలోకి అనుమతించవద్దని, విద్యార్థులతోపాటు, సిబ్బందిని ఫ్రిస్కింగ్ చేపట్టి, తనిఖీ తర్వాతనే అనుమతించాలని ఆయన తెలిపారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వుంటూ, అన్ని భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సజావు పరీక్షల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగాఏర్పాటు చేసిన 97 పరీక్షా కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10148, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 6429, మొత్తం 16577 మంది రెగ్యులర్, 279 మంది ప్రయివేటుగా పరీక్షలు వ్రాస్తున్నట్లు ఆయన అన్నారు. 97 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 97 మంది శాఖాధికారులు, 6 ఫ్లయింగ్ స్క్వాడ్, 97 సిట్టింగ్ స్క్వాడ్, 1983 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు.ఈ సందర్భంగా నయాబజార్ కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహారావు, అధికారులు తదితరులు ఉన్నారు.

## అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలి

## జిల్లా కలెక్టర్ వి పి గౌతం

**ఖమ్మం ప్రతినిధి మార్చి 18 ప్రజా జ్యోతి**

అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టర్, నూతన కలెక్టరేట్ లోని అన్ని శాఖల కార్యాలయాల సందర్శన చేసి, రాజకీయ నేతల, రాజకీయ పార్టీలకు సంబంధించి క్యాలెండర్లు, పోస్టర్లు ఫోటోలు తొలగించింది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం లోకసభ ఎన్నికల షెడ్యూల్ ను. ఈ నెల 16న విడుదల చేసిందని, షెడ్యూల్ విడుదలైన తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల్లో 24 గంటల్లో, పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద 48 గంటల్లో, ప్రయివేటు స్థలాల్లో 72 గంటల్లో రాజకీయ నేతలు, రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్స్, ఫ్లెక్సీలు, ఫోటోలు తొలగించాలని, విగ్రహాలకు ముసుగు వేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలు,



నియమ నిబంధనలు అధికారులు, సిబ్బంది తప్పక పాటించాలని కలెక్టర్ అన్నారు.ఈ సందర్భంగా శిక్షణా సహాయ కలెక్టర్ యువరాజ్, ఇంచార్జ్ జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వున్నారు.

# రైళ్ల సాధనే లక్ష్యం

**సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి**

**కారేపల్లి,మార్చి 18, ప్రజాజ్యోతి:**

డోర్నకల్ నుండి కారేపల్లి జంక్షన్ మీదుగా భద్రాచలం రోడ్డుకు గతంలో నడిచిన రైళ్లను పునరుద్ధరించాలని సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ...కరోనా సమయంలో రద్దు చేసిన రైల్వే శాఖ ఇంతవరకు ఆ రైళ్ళను పూర్తిస్థాయిలో పునరుద్ధరించలేదని, నడుస్తున్న ఒకటి రెండు రైళ్లను కూడా కారేపల్లి లో గతంలో ఆగిన అన్ని స్టేషన్లలో హాల్టింగ్ ఇవ్వలేదని అసనం వ్యక్తం చేశారు. గతంలో నడిచిన రైళ్లను పునరుద్ధరించాలని రైల్వే అధికారులకు,పార్లమెంట్ సభ్యులకు ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చి మొరపెట్టుకున్న ఫలితం లేదని అన్నారు.కరోనా సమయంలో దేశవ్యాప్తంగా రైళ్ళన్నింటినీ రద్దు చేసిన రైల్వేశాఖ కరోనా మహమ్మారి ఉధృతి తగ్గిన తర్వాత దేశవ్యాప్తంగా అన్ని రైళ్ళను పునరుద్ధరించగా,గిరిజన ప్రాంతమైన డోర్నకల్ నుండి భద్రాచలంరోడ్డు వరకు నడిచే రైళ్లలో మాత్రం ఒకటి,రెండు మినహా మిగతా రైళ్లను పునరుద్ధరించకపోవడం పట్ల



ఈ ప్రాంతంపై రైల్వే శాఖకు ఉన్న వివక్ష ఏమిటో స్పష్టమవుతుందని అన్నారు.అంతేగాక కారేపల్లి రైల్వే స్టేషన్లో కరోనాకు ముందు రిజర్వేషన్ కౌంటర్ ఉండగా కరోనా తర్వాత ఆ రిజర్వేషన్ కౌంటర్ ను కూడా ఎత్తివేశారు. ఈ రైల్వేలైన్ లో నిత్యం గూడ్స్ రైళ్ల ద్వారా బొగ్గు, డొలమైట్ రాయిని సరఫరా చేస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్న రైల్వే శాఖ ఈ రైల్వే లైన్ లోని ప్రయాణికుల సౌకర్యాలపై మాత్రం చిన్న చూపు చూస్తోందని వాపోయారు.కారేపల్లి జంక్షన్ రైల్వే లైన్ లో రైళ్ల పునరుద్ధరణ,పైన పేర్కొన్న సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ 10 అంశాలతో కారేపల్లికి చెందిన సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి “మా జంక్షన్ మా మేనిఫెస్టో” పేరుతో ఒక కరపత్రం రూపొందించారు.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంటు స్థానం నుండి గెలిచే అభ్యర్థి కారేపల్లి జంక్షన్ రైల్వేలైన్ లో రైళ్ల పునరుద్ధరణ,రైల్వే సమస్యల పరిష్కారానికి కట్టుబడాలని డిమాండ్ చేస్తూ ఈ మేనిఫెస్టో ను ఖమ్మం పార్లమెంటు స్థానానికి పోటీ చేసే ప్రతి అభ్యర్థికి ఇవ్వడం జరుగుతుందని అయన తెలిపారు.